క్లుప్తంగా

తిమ్మారెడ్డి సేవలు మరువలేనివి



చైర్‌పర్సన్ కాపు భారతి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న తిమ్మారెడ్డి

కళ్యాణదుర్గం రూరల్: రక్తదాన సేవకుడు కంబాల తిమ్మారెడ్డి సేవలు మరువలేవని జిల్లా రెడ్ క్రాస్ చైర్‌పర్సన్ కాపు భారతి తెలిపారు. శనివారం ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా ఇండియన్ రెడ్ క్రాస్ బ్లడ్‌బ్యాంక్ కేంద్రంలో రక్తదానం సేవలు అందించిన వారికి అనంతపురంలోని రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్ కేంద్రంలో రెడ్ క్రాస్ చైర్మన్ కాపు భారతి, రెవెన్యూ డివిజన్ అధికారి కేశవ నాయుడు చేతుల మీదుగా అవార్డులు అందజేశారు. కళ్యాణదుర్గానికి చెందిన దుర్గం రక్తదాతలు ఫౌండర్, అధ్యక్షుడు లయన్ కంబాల తిమ్మారెడ్డి అవార్డు అందుకున్నారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ సిబ్బంది, పలు స్వచ్ఛంద సేవా సంస్థలు, ప్రతినిధులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా సప్తగిరిమల్లికి పురస్కారం



ఉత్తమ రక్తదాతల పురస్కారాన్ని అందుకుంటున్న సప్తగిరిమల్లి

ఉరవకొండ: అనంతపురంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉత్తమ రక్తదాతలకు పురస్కారాలు అందించారు. ఇందులో ఉరవకొండకు చెందిన సామాజిక సేవకుడు సప్తగిరి మల్లికార్జునకు ఉత్తమ రక్తదాతల పురస్కారాన్ని శనివారం అందించారు.

కుష్టు వ్యాధిగ్రస్తులు పరిశుభ్రత పాటించాలి



మందులు, క్లాత్ అందిస్తున్న జిల్లా అదనపు వైద్యాధికారిణి డాక్టర్ అనుపమా జేమ్స్

కూడేరు: కుష్టు వ్యాధిగ్రస్తులు తప్పనిసరిగా పరిశుభ్రత పాటించాలని లేదంటే పుండ్లు ఏర్పడతాయని జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ అనుపమ జేమ్స్ సూచించారు. శనివారం మండలంలోని కుష్టు రోగుల కాలనీలో 'టీబీ ముక్తా భారత్' కార్యక్రమాన్ని వైద్యాధికారులు నిర్వహించారు. జిల్లా అదనపు వైద్యాధికారిని డాక్టర్ అనుపమ జేమ్స్ ముఖ్య అతిథిగా హాజరై కాళ్లుచేతులకు పుండ్లు కాకుండా తీసుకోవాల్సిన జాగ్రతలు తెలియజేశారు. ప్రాథమిక దశలోనే కుష్టు వ్యాధిని గుర్తిస్తే మందులతో నయం చేయొచ్చని తెలిపారు. వ్యాధిగ్రస్తులు చెప్పులు తప్పకుండా ధరించాలన్నారు. కార్యక్రమంలో డీపీఎంఓలు సత్యనారాయణ, తిప్పేస్వామి, ఫిజియోథెరపిస్టు రాముడు, సీహెచ్ఓ సరోజమ్మ, సూపర్ వైజర్ రవీంద్ర, ఎంఎల్‌హెచ్‌పీ చంద్రకళ, ఏఎస్ఎం భాను, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ నాగస్వామి

వజ్రకరూరు: మండల కేంద్రంలో శనివారం సాయంత్రం ఎస్‌ఐ నాగస్వామి, సిబ్బంది తనిఖీలు చేశారు. వజ్ర కరూరులోని ఉరవకొండ-గుంతకల్లు ప్రధాన రహదారిలో రాకపోకలు సాగిస్తున్న వాహనాలను తనిఖీ చేసి, రికార్డులు పరిశీలించారు. నిబంధనలకు విరుద్ధంగా రాకపోకలు సాగిస్తున్న వాహనాలకు జరిమానా విధించారు.

నిధులు మంజూరు చేయండి



ఎమ్మెల్యేను కలిసిన కబరస్తాన్ డెవలప్‌మెంట్ కమిటీ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, సభ్యులు

కణేకల్లు: కణేకల్లులోని ముస్లిం కబరస్తాన్ కు ప్రహరీ నిర్మాణానికి ప్రభు త్వం నుంచి నిధులు మంజూరు చేయించాలని కబరస్తాన్ డెవలప్‌మెంట్ కమిటీ సభ్యు లు ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులును కోరారు. శనివారం ఎమ్మెల్యే కాలవను కబరస్తాన్ డెవలప్‌మెంట్ కమిటీ అధ్యక్షులు బషీర్, ఉపాధ్యక్షులు బాషా, సలహాదారులు గౌస్, కార్యదర్శి జావిద్, సహాయ కార్యదర్శులు గౌస్‌పీర్, షాకీర్, షాహన్‌వాజ్‌లు కలిశారు. ప్రహరీ నిర్మాణానికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు కమిటీ నాయకులు తెలిపారు.

అదుపుతప్పి కారు బోల్తా

గుమ్మఘట్ట: నేత్రపల్లి క్రాస్ వద్ద కారు అదుపు తప్పి బోల్తా పడడంతో డ్రైవర్ భూతయ్య గాయపడ్డాడు. సిరిగెదొడ్డి గ్రామానికి చెందిన భూతయ్య భూపసముద్రం గ్రామం నుంచి శనివారం స్వగ్రామానికి కారులో వెళ్తుండగా నేత్రపల్లి క్రాస్ వద్దకు చేరుకోగానే అదుపు తప్పి బోల్తా పడింది. స్థానికులు క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం రాయదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు విచారణ చేపట్టారు.

పాదయాత్రకు విశేష స్పందన

- వాహనాల్లో భారీగా తరలివచ్చిన జనం
- కళ్యాణదుర్గానికి చేరిన సేవ్ ఆర్డీటీ పాదయాత్ర





సీవీ తండా సమీపంలో రంగయ్య పాదయాత్రకు మద్దతు తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ ఐటీ వింగ్ సభ్యులు, పాదయాత్రకు హాజరైన జనం

కళ్యాణదుర్గం: ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఆర్డీటీ పరిరక్షణ కొరకు మాజీ ఎంపీ, పీఏసీ సభ్యులు చేస్తున్న పాదయాత్రకు ప్రజా చైతన్యం కదలివస్తోంది. శనివారం 11వ రోజు పాదయాత్ర కంబదూరు మండలం నూతిమడుగు నుంచి సీవీ తండా, కళ్యాణదుర్గం మండలంలోని కడదరకుంట, పింజిరి కొట్టాల, బాల వెంకటాపురం గ్రామానికి పాదయాత్ర చేరుకుంది. ఈ సందర్భంగా పాయాత్రకు ప్రజల నుంచి భారీ స్పందన లభించింది. ఆర్డీటీ ద్వారా సేవలు పొందిన కుటుంబాల నుంచి ప్రజలు పాదయాత్రకు సంఘీభావంగా తరలివచ్చారు. ఊరూరా పాదయాత్రకు మద్దతుగా తలారి రంగయ్యతో అడుగులు వేస్తూ పూల వర్షం కురిపించారు. ఆర్డీటీ మూసివేస్తే పేద ప్రజలు పడే ఇబ్బందులను ప్రజలకు వివరిస్తూ పాదయాత్ర కొనసాగింది. సుమారు రెండు కిలోమీటర్ల మేర ప్రజలు, వాహనాల రాకతో గ్రామాల్లో ప్రజల్లో కొత్త చైతన్యం వచ్చింది. ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ సాధించేవరకు పోరాటం ఆపబోమని మాజీ ఎంపీ తలారి రంగయ్య స్పష్టంచేశారు. మున్సిపాలిటీ కన్వీనర్ ఐ సుధీర్, పార్టీ అధికార ప్రతినిధి గోపారం శ్రీనివాసులు, మున్సిపల్ చైర్మన్ రాజ్‌కుమార్, ఎంపీపీలు భీమేష్, నాగరాజు, వివిధ మండలాల కన్వీనర్లు ఎంఎస్ రాయుడు, జీకే రాయుడు, పాలబండ్ల చంద్ర శేఖర్ రెడ్డి, లీగల్ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు హనుమంతరెడ్డి, వివిధ విభాగాల అధ్యక్ష,కార్యదర్శులు ములకనూరు తిమ్మరాయుడు, యర్రంపల్లి కృష్ణమూర్తి, రామాంజనేయులు యాదవ్, పిల్లలపల్లి అంజి, కామక్కపల్లి మల్లి, చరణ్, శ్రీకాంత్, బిక్కిహరి, ప్రతాప్, ఎన్. తిప్పేస్వామి, మాజీ జెడ్పీటీసీ రాజగోపాల్, జేసీఎస్ కన్వీనర్లు గంగాధర్, అంజి, నాగలక్ష్మి, ఆయా గ్రామాల సర్పంచులు సోమశేఖర్, శివన్న, నగేష్ నాయక్, ఎంపీటీసీలు ధనుంజయ, వెంకట్రామ్‌నాయక్, సీవీ తండా రాయుడు, తులసీ నాయక్, లక్ష్మానాయక్, రేణుకాబాయి, మంగమ్మ, శివన్న, నారప్ప, రామాంజనేయులు, సూర్య నారాయణరెడ్డి, రామ్మూర్తి, శీనప్ప, చిన్న గంగన్న, ధనుంజయ, బాల వెంకటాపురం శేఖర్, నిజాంవలి, తిప్పానాయక్, ఇమాంవలి, జిలాన్, ధనుంజయ నేయులు, నూర్, షేక్షావలి, సర్దానప్ప, తిప్పన్న, వలి, ఇతర గ్రామాల సర్పంచులు హనుమంతప్ప, హనుమంతరాయుడు, జోజిరెడ్డి, దురదకుంట వన్నూరుస్వామి, నారాయణ స్వామి, నారాయణస్వామి, కిరీటియాదవ్, జానీ, మల్లి, రాము, నాయక్, సోమశేఖర్, మంజుతో పాటు అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళా విభాగం ఆధ్వర్యంలో..

పార్టీ మహిళా విభాగం జిల్లా ఉపాధ్యక్షురాలు లక్ష్మీదేవమ్మ, వైస్ ఎంపీపీ కాంతమ్మ, అంగన్‌వాడీ విభాగం అధ్యక్షురాలు సునీత సంఘీభావం తెలిపారు.

తరలివచ్చిన రాయదుర్గం నేతలు..

కళ్యాణదుర్గం: ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ రెన్యూవల్ కోసం మాజీ ఎంపీ తలారి రంగయ్య చేపట్టిన పాదయాత్ర శనివారం కళ్యాణదుర్గం మండలంలోకి చేరుకుంది. ఈ సందర్భంగా రాయదుర్గం మాజీ ఎమ్మెల్సీ, పార్టీ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి తన అనుచరులతో కలిసి కడదరకుంట వరకు సుమారు 60 వాహనాల్లో తరలివచ్చి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో చేనేత విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొరాళ్ల శివకుమార్, చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు నాగప్ప, పట్టణ అధ్యక్షుడు శ్రీనివాసులు, కౌన్సిలర్లు ఇస్మాయిల్, పొరాళ్ల గోవిందరాజులు, ఆర్వో శివప్ప, సంజీవ, ఐనాపురం మంజు, కె.శ్రీనివాసులు, బ్రహ్మానందరెడ్డి, కేశవరెడ్డి, హంపారెడ్డిలతో పాటు అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ఐటీ వింగ్ సంఘీభావం..

వైఎస్సార్‌సీపీ ఐటీ వింగ్ సభ్యులు శనివారం తలారి రంగయ్య పాదయాత్రకు సంఘీభావం తెలిపారు. సభ్యులు మంజునాథ్ యాదవ్, అబ్బవరం భాస్కర్ రెడ్డి, పులివెందుల కుమార్, తంబళ్లపల్లి రాజశేఖర్ రెడ్డి, కొడిగెనహళ్లి షబ్బీర్, శేషు రాయల్, ఉమామహేశ్వరరెడ్డి, పూల ప్రవీణ్‌కుమార్, గోపిరెడ్డి, చంద్ర, విష్ణువర్ధన్‌రెడ్డి, తిప్పేష్‌రెడ్డి, రాజేష్‌లతో పాటు అధిక సంఖ్యలో సభ్యులు పాల్గొని తమ మద్దతు తెలిపారు.

నేడు కాంగ్రెస్ సీడబ్ల్యూసీ సభ్యుడు రఘువీరారెడ్డి రాక..

మాజీ ఎంపీ తలారి రంగయ్య ఆర్డీటీ పరిరక్షణ కోసం చేస్తున్న పాదయాత్రకు ఆదివారం పీసీసీ మాజీ అధ్యక్షులు, సీడబ్ల్యూసీ సభ్యులు డాక్టర్ నీలకంఠాపురం రఘువీరారెడ్డి హాజరు కానున్నట్లు పార్టీ వర్గాలు తెలిపారు. ఆర్డీటీ కోసం మాజీ ఎంపీ తలారి రంగయ్య చేస్తున్న సాహసోపేతమైన పాదయాత్రకు ఇటీవల ఫోన్లో మద్దతు తెలిపారు. కళ్యాణదుర్గం మండలంలోని బాల వెంకటాపురం గ్రామంలో జరిగే పాదయాత్రకు ఉదయం 9 గంటలకు హాజరై సంఘీభావం తెలపనున్నారు.



తలారి రంగయ్య, పార్టీ నేతలను గజమాలతో సన్మానిస్తున్న కళ్యాణదుర్గం మండల నేతలు



కడదరకుంటలో తలారి రంగయ్యకు హారతులు పడుతున్న మహిళలు



పాదయాత్రకు సంఘీభావం తెలుపుతున్న మహిళా విభాగం జిల్లా ఉపాధ్యక్షురాలు లక్ష్మీదేవమ్మ



బాల వెంకటాపురంలో పాదయాత్ర

తొలకరి సమయం.. అప్రమత్తతతో వ్యాధులు దూరం

మీకు తెలుసా?

- జీవాలకు వ్యాధులు సోకే అవకాశం
- నిర్లక్ష్యం చేస్తే పశువులకు ముప్పు



ఉరవకొండ రూరల్: వేసవి ముగిసింది.. వర్షాకాలం వచ్చేసింది. తొలకరి సమయంలో జీవాలకు వ్యాధులు సోకే అవకాశం ఉందని అప్రమత్తంగా ఉండాలని పశు వైద్యాధికారులు సూచిస్తున్నారు. వర్షాకాలంలో పశువులపై వ్యాధులు దాడి చేస్తాయంటున్నారు. జాగ్రత్తలు పాటిస్తే వ్యాధుల బారి నుంచి పశువులు, జీవాలను కాపాడుకోవచ్చని పశు వైద్యులు సూచిస్తున్నారు. రోగాలు వచ్చినట్లు గుర్తించగానే సంచార పశు వైద్యశాల టోల్ ఫ్రీ నంబర్ 1962కు సమాచారం అందించాలని చెప్తున్నారు.

వర్షాకాలంలో వచ్చే వ్యాధులు ఇవీ..

వర్షాకాలంలో చిటుక వ్యాధి వచ్చే అవకాశం ఉంది. దీంతో గొర్రెలు, మేకలు జ్వరం, నీరసంతో మేత మేయవు. గొర్రెలు చిటికి వేసినంత కాలంలోనే చనిపోతాయి. తొలకరి వర్షాలకు 10 నుంచి 15 రోజుల ముందుగానే పశు వైద్యులను సంప్రదించి, ఇటానస్ టీకా వేయించాలి.

గొంతువాపుతో జీవాలకు ముప్పు : పశువులకు గొంతువాపు వ్యాధితో ముప్పు ఉంటుంది. ఈ వ్యాధి బారిన పడిన పశువుల కంటి నుంచి నీరు కారడం, నోటి నుంచి సొంగ కారడం, శ్వాస పీల్చడానికి ఇబ్బంది పడతాయి. గొంతుకిందకు నీరు దిగి, గొంతువాపు వస్తుంది. జూన్, జులై నెలల్లో (హెచ్ఎస్) టీకా వేయించుకోవాలి.

నీలి నాలుక వ్యాధితో జాగ్రత : నీలి నాలుక వ్యాధి వస్తే గొరెరల నోటి నుంచి సొంగ కారటం, ముఖం, పెదవుల చివరన వాపు వస్తుంది. పారుకోవటం, మోకాళ్లపై కూర్చొని నడవడం చేస్తాయి. గొర్రెలు, మేకల కొట్టంలో వేపాకు పొగ పెట్టాలి. బ్లూ టంగ్ అను టీకా వేయించాలి.

ఉరవకొండ డివిజన్ పరిధిలో పశువులు, గొర్రెలు, మేకల వివరాలు..	
పశువులు	మొత్తం
ఆవులు	1,32,437
గేదెలు	81,153
మేకలు	11,79,967
గొర్రెలు	2,44,352

గాలికుంటు వ్యాధితో నీరసం : ఆవులు, ఎద్దులు, గేదెలకు గాలికుంటు వ్యాధి సోకే అవకాశ ఉంది. ఈ వ్యాధితో పశువులకు శరీర ఉష్ణోగ్రత 104 నుంచి 105 డిగ్రీలు ఉంటుంది. నోట్లో, గిట్టల మధ్య పుండ్లు ఏర్పడతాయి. గ్రాసం తినవు. నీరసించిపోతాయి. పాడి పశువుల్లో పాల ఉత్పత్తి తగ్గుతుంది. వైద్యులు సూచన మేరకు యాంటీ బయోటిక్స్, పెయిన్ కిల్లర్స్ మందులను వాడాల్సి ఉంటుంది.

వెంటనే వైద్యులను సంప్రదించాలి



పశువులు, గొర్రెలు, మేకల్లో అనారోగ్యాన్ని గుర్తిస్తే వెంటనే సమీపంలోని పశు వైద్యులను సంప్రదించాలి. వర్షాకాలంలో వ్యాధులు సోకే అవకాశం ఎక్కువ కాబట్టి వ్యాధి నివారణ టీకాలు వేయించాలి. గొంతువాపు, చిటుకు వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించాలి. ఎలాంటి సందేహాలున్నా వెంటనే పశు వైద్య కేంద్రాల్లో వైద్యులను సంప్రదించాలి.

– పెద్దన్న, ఏడీ, ఉరవకొండ

కార్యకర్తలకు అండగా ఉంటాం



జగదీశ్వరరెడ్డిని పరామర్శిస్తున్న సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి

బొమ్మనహాళ్: వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా ఉంటామని సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి భరోసా కల్పించారు. శనివారం మండలంలోని చంద్రగిరి గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు జగదీశ్వరరెడ్డిని పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. అనంతరం మెట్టు గోవిందరెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి ప్రతి ఒక్క కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పయ్యావుల సత్యన్న, కోటేశ్వరరెడ్డి, సూర్యప్రతాప్‌రెడ్డి, తిరుమలరెడ్డి, లక్ష్మీనారాయణ, జయరాంరెడ్డి, హరి, ఆంజనేయులు, వెంకటేశులు, ఫొటో బసవరాజు, డాక్టర్ బసప్ప, హనుమేష్ తదితరులు పాల్గొన్నారు.

నీట్ ఫలితాల్లో దుర్గం విద్యార్థి ప్రతిభ



చిన్మయ్ చాణిక్య

కళ్యాణదుర్గం రూరల్: నీట్ ఫలితాల్లో పట్టణానికి చెందిన దాసరి సతీష్, అర్చన దంపతుల కుమారుడు చిన్మయి చాణిక్య సత్తా చాటాడు. శనివారం నీట్ ఫలితాలు విడుదలయ్యాయి. 560 మార్కులు సాధించి, ఆలిండియాలో 8,492 ర్యాంక్ సాధించాడు. నీట్‌లో సత్తా చాటిన చిన్మయి చాణిక్యను ఉపాధ్యాయులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు అభినందించారు.

జాబితాలో పేర్లు కనిపించక ఆందోళన



ఉరవకొండలోని నాల్గో సచివాలయం వద్ద తల్లికి వందనం జాబితాలో పిల్లల పేర్లు చూసుకుంటున్న తల్లిదండ్రులు

ఉరవకొండ: పట్టణంలోని ఐదు సచివాలయాల పరిధిలో ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన తల్లికి వందనం జాబితాల్లో తమ పిల్లల పేర్లు ఉన్నాయో లేదో అని చూసుకోవడానికి శనివారం సచివాలయాలకు లబ్ధిదారులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. చాలా మంది లబ్ధిదారుల పేర్లు అనర్హుల జాబితాలో లేకపోవడంతో వారు సచివాలయాల ఉద్యోగుల వద్దకు వెళ్లి తమ పిల్లల పేర్లు ఎందుకు లేవో అడిగి తెలుసుకుంటున్నారు. అయితే చాలా మందికి కరెంట్ బిల్లులు ఎక్కువగా వచ్చాయని, అందుకే అనర్హుల జాబితాలో పేర్లు ఉన్నాయని సచివాలయ ఉద్యోగులు చెప్తున్నట్లు తెలిసింది. అయితే తల్లికి వందనం జాబితా గందరగోళంగా ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు చెప్తున్నారు.

అరటికి తెగుళ్లు..రైతుల ఆందోళన

- అరటి పంటకు ఆశించిన పచ్చ, లద్దె పురుగు



జయపురంలో సాగు చేసిన అరటి పంట

కూడేరు: అరటి పంటకు పచ్చ, లద్దెపురుగు ఆశించడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండల పరిధిలోని జయపురం, ముద్దలాపురం, కూడేరు, కడదరకుంట, ఇప్పేరు, అంతరగంగ, మరుట్ల, ఉదిరిపికొండ, కొర్రకోడు, కరుట్లపల్లి, పి.నారాయణపురం, గొటుకూరు, రామచంద్రాపురంతో పాటు మరికొన్ని గ్రామాల్లో రైతులు సుమారు 400 ఎకరాల్లో అరటి పంట సాగు చేశారు. కాగా అరటి పంటకు పచ్చ పురుగు, లద్దె పురుగు ఆశించాయి. ఆకులను, సుడి భాగాన్ని పురుగులు తినేస్తున్నాయి. సుడి భాగం దెబ్బతింటే మొక్క ఎదుగుదల తగ్గిపోతుంది. పురుగుల నివారణకు మందులు పిచికారీ చేసినా తగ్గుముఖం పట్టడంలేదు. దీంతో అరటి రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎకరా విస్తీర్ణంలో అరటి సాగుకు సుమారు రూ.లక్ష వరకు పెట్టుబడి అయిందని రైతులు చెప్తున్నారు. అధికారులు అరటి పంటను పరిశీలించి తెగుళ్ల నివారణకు తగు సూచనలు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

వైభవంగా ఎర్రితాతస్వామి ఆరాధనోత్సవాలు



ఎర్రితాతస్వామి శేషతల్ప అలంకరణ



ఎర్రితాతస్వామి దర్శనానికి తరలివచ్చిన భక్తులు

బొమ్మనహాళ్: మండల కేంద్రంలోని శాంతిధామంలో సద్గురు ఎర్రితాతస్వామి 89వ ఆరాధనోత్సవాలు మొదటిరోజు వైభవంగా జరిగాయి. శనివారం ఉదయం నుంచి స్వామికి సహస్రమూలికా పంచామృతాభిషేకాలు, రుద్ర, గణపతి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా స్వామివారు శేషతల్ప అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. తొలుత స్వామి ప్రభోత్సవాన్ని సాంప్రదాయం ప్రకారం విఘ్నేశ్వరస్వామి ఆలయం వద్ద ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎర్రితాతస్వామి ఆలయం నుంచి పల్లకీసేవతో స్వామివారి చిత్రపటం, ఉత్సవమూర్తిలతో ఉత్సవాన్ని ప్రారంభించారు. రాత్రి ప్రత్యేక పూజలతో స్వామి ప్రభోత్సవంలోనూ భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రభోత్సవాన్ని శాంతిధామం వరకు ఊరేగించారు. ఎస్‌ఐ శివ నేతృత్వంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆదివారం ఉట్లపరుష కార్యక్రమం, ఆలయంలో ప్రత్యేక భజన, కోలాట కార్యక్రమాలు కొనసాగనున్నాయి.

దెబ్బతిన్న ఎస్ఎస్‌పీతండా రోడ్డు



అధ్వానంగా ఉన్న ఎస్ఎస్‌పీ తండా రోడ్డు

వజ్రకరూరు: మండలంలోని ఎస్ఎస్‌పీతండాకు వెళ్లే ప్రధాన రహదారి గుంతలు పడింది. తట్రకల్లు నుంచి ఎస్ఎస్‌పీతండాకు వెళ్లే ప్రధాన రహదారిలో అక్కడక్కడ గుంతలు పడి రోడ్డు దెబ్బతినింది. దీంతో వాహనదారులు, గ్రామస్తులు ఇక్కట్లు పడుతున్నారు. రోడ్డు దెబ్బతినడంతో రాత్రి వేళల్లో రాకపోకలు సాగించే సమయంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి దెబ్బతిన్న రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు, వాహనదారులు కోరుతున్నారు.

యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం



బొమ్మనహాళ్‌లో యోగా చేస్తున్న మహిళలు

బొమ్మనహాళ్: యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉండొచ్చని ఎంపీడీఓ విజయభాస్కర్ తెలిపారు. శనివారం మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల ఆవరణలో యోగాంధ్ర 2025 కార్యక్రమంలో భాగంగా యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ రోజూ యోగా చేయడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి



డీడీఓ డాక్టర్ శ్రావణ్‌కుమార్

బొమ్మనహాళ్: ప్రతి ఒక్కరూ సమయ పాలన పాటించాలని డీడీఓ డాక్టర్ శ్రావణ్ కుమార్ ఆదేశించారు. శనివారం స్థానిక పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేసి, రికార్డులు పరిశీలించారు. డాక్టర్ శ్రీలక్ష్మి ఆస్పత్రికి రాకపోవడంతో డీఎంహెచ్ఓ ఆదేశాల మేరకు మెమో జారీ చేశారు. అనంతరం డీడీఓ మాట్లాడుతూ కొన్ని రోజులుగా డాక్టర్ శ్రీలక్ష్మి విధులకు హాజరు కావడంలేదని ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలన్నారు. సీజనల్ వ్యాధులపై ప్రజలకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలన్నారు.

ట్రాక్టర్ ఢీకొని పాఠశాల ప్రహరీ ధ్వంసం



ధ్వంసమైన ఆజాద్ ఉర్దూ స్కూల్ ప్రహరీ

రాయదుర్గంటౌన్: పట్టణంలోని 17వ వార్డు పరిధిలోని ఆజాద్ ఉర్దూ స్కూల్ ప్రహరీని గరుసు మట్టి తరలిస్తున్న ట్రాక్టర్ శనివారం సాయంత్రం ఢీకొనింది. వెంకటేశ్వర కాలనీలోని ఓ ప్లాట్‌కు మట్టి తరలిస్తున్న ట్రాక్టర్ మలుపు వద్ద వేగంగా వచ్చి గోడను ఢీకొనింది. పాఠశాల ప్రహరీ కూలిపోయింది. విచ్చలవిడిగా గ్రావెల్‌ను తరలిస్తున్నా రెవెన్యూ అధికారులు ఏమాత్రం పట్టించుకోలేదని స్థానిక ప్రజలు అంటున్నారు. అనుమతి లేకుండా కొండ పొరంబోకు స్థలాల నుంచి మట్టి తరలిస్తున్నట్లు చెప్తున్నారు.

మెట్ల మార్గంలో దర్శనానికి వెళ్తూ యువకుడి మృతి

కళ్యాణదుర్గం రూరల్: పట్టణానికి చెందిన జాఫర్(25) వేంకటేశ్వరస్వామి దర్శనానికి మెట్ల మార్గంలో నడిచి వెళ్తూ గుండెపోటుతో శనివారం మృతి చెందాడు. నబీరసూల్, కుషీదాబీ దంపతుల కుమారుడు జాఫర్ పట్టణంలో తండ్రితో కలిసి గుజిరీ వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం స్నేహితులతో కలిసి వేంకటేశ్వరస్వామి దర్శనానికి వెళ్లారు. శ్రీవారి మెట్ల మార్గాన కాలినడకన వెళ్తున్న సమయంలో జాఫర్‌కు గుండెపోటు వచ్చింది. స్థానిక భక్తుల సహాయంతో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే జాఫర్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

అంజన్నకు అభిషేకం

బొమ్మనహాళ్: ప్రసిద్ధి చెందిన నేమకల్లు ఆంజనేయస్వామికి శనివారం అభిషేకం చేశారు. స్వామి మూలవిరాట్‌ను పట్టువస్త్రాలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. పురోహితులు వేకువజాము నుంచే స్వామికి కుంకుమార్చన, పంచామృతాభిషేకం, ఆకుపూజ, తమలపాకు అలంకరణ, అర్చనలు, అభిషేకాలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు.

బసాపురం ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

కూడేరు: బసాపురం ఆంజనేయ స్వామికి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. మండలం నుంచే కాక జిల్లా కేంద్రం అనంతపురం నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అలయ అర్చకుడు దుర్గ చైతన్య ఆంజనేయ స్వామి మూలవిరాట్‌కు క్షీరాభిషేకం చేసి, తర్వాత వివిధ రకాల పట్టువస్త్రాలు, పుష్పాలతో అలంకరించారు. భక్తులు ఆంజనేయుడిని దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అన్నదానం చేశారు. సాయంత్రం ఆంజనేయ స్వామి మూలవిరాట్‌ను పల్లకీలో ఉంచి ఊరేగించారు.